సాక్షి కామారెడ్డి

శనివారం । 14 । జూన్ । 2025



సౌకర్యాలు కల్పిస్తాం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు.

- 9లో ▸



పకడ్బందీగా నిర్వహించాలి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులు సూచించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
36.1 /23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'అంకిత భావంతో పాఠాలు బోధించాలి'



గాంధారి : ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యార్థులకు పాఠాలు బోధించాలని డీఈవో రాజు సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రణవానంద దాస్ స్వామీజీ రాక



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగే పలు కార్యాక్రమాలలో పాల్గొనేందుకు అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ప్రతినిధి ప్రణవానంద దాస్ రానున్నారని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భూమేశ్ గుప్తా తెలిపారు. శుక్రవారం కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. స్వామీజీ రాక సందర్భంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని హౌసింగ్ బోర్డు శారదామాత ఆలయం నుంచి ధర్మశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం కన్యకా పరమేశ్వరి ఆలయంలో స్వామివారి ప్రవచన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఇస్కాన్ కామారెడ్డి ఇన్‌చార్జి వెంకటరాస్, కన్వీనర్ సిద్దిరాములు, ప్రతినిధులు శ్రీహరి, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల జారీలో జాప్యంతో ఇబ్బందులు

నాగిరెడ్డిపేట: అధికారులు రెవెన్యూ సదస్సులలో బిజీగా ఉండడంతో సకాలంలో సర్టిఫికెట్లు జారీ కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత పది రోజులుగా భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. అధికారులు ఆయా సదస్సులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు బిజీగా ఉంటున్నారు. దీంతో మిగతా కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది. ప్రధానంగా విద్యాసంవత్సరం ప్రారంభం నేపథ్యంలో విద్యార్థులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అవసరం అవుతాయి. కులం, ఆదాయం, లోకల్ సర్టిఫికెట్లకోసం వారు తహసీల్ ఆఫీస్‌కు వస్తున్నారు. కానీ అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారి పనులు ముందుకు సాగడం లేదు. ఈ అంశాన్ని 'సాక్షి' నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దృష్టికి తీసుకువెళ్లగా సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనన్నారు. సోమవారం నుంచి సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని పేర్కొన్నారు.

ప్రాణానికేది విలువ!?



- అయితే హత్యలు.. లేకపోతే ఆత్మహత్యలు
- చిన్నపాటి గొడవలకే కఠిన నిర్ణయాలు

✤ కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామానికి చెందిన స్రవంతి (25), తన కొడుకు రుద్రేశ్వర్ (4) తో కలిసి ఈనెల 6న చిన్నమల్లారెడ్డి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబంలో గొడవలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

✤ లింగంపేట మండలం పొల్కంపేటలో భార్యతో జరిగిన గొడవ కొడుకు హత్యకు దారితీసింది. పిల్లలు ఆడుకుంటూ తోసుకున్న విషయమై అనిల్‌కు అతడి భార్యకు గొడవ జరిగింది. ఈ క్రమంలో భార్యను కొట్టిన అనిల్.. తర్వాత నాలుగేళ్ల కొడుకు శశాంక్‌ను బయటకు తీసుకువెళ్లి ఊపిరాడకుండా చేసి హతమార్చాడు.

✤ పిట్లం మండలం రూంతండాకు చెందిన దరావత్ కృష్ణ (28) చిన్నకొడప్‌గల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంలో సదరు మహిళకు ఆమె భర్తకు గొడవలు జరిగాయి. చివరకు వారిద్దరు కలిసి దరావత్ కృష్ణను హతమార్చాలని నిర్ణయించుకున్నారు. మరో ఇద్దరి సహకారంతో కృష్ణను కత్తితో పొడిచి చంపి చెరువులో పడేశారు.

ప్రాణాలకు విలువ లేకుండా పోతోంది. చిన్నచిన్న కారణాలతో హత్యలు చేస్తున్నారు. లేకపోతే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఎక్కువగా క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలతో కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఇంటింటికీ మంటిపొయ్యే అన్నట్లుగా కలహాలు లేని కాపురాలు ఉండవు. ప్రతి ఇంట్లో పొరపొచ్చాలు సహజం. ఒకరినొకరు అర్థం చేసుకుంటే, ఓర్పుతో కూర్చుని మాట్లాడుకుంటే అంతా సర్దుకుంటుంది. తెగేదాకా లాగితేనే ఇబ్బంది.. గొడవలు జరిగినప్పుడు, వివాదాలు తలెత్తినప్పుడు క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలతో విలువైన ప్రాణాలు పోతున్నాయి. కొందరు ఆవేశంలో ప్రాణాలు తీస్తుండగా.. మరికొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. కుటుంబాల్లో తలెత్తే చిన్నపాటి గొడవలతో ఆవేశాలకు లోనవుతుండడంతో సమస్యలు పెరుగుతున్నాయి.

వివాహేతర సంబంధాలతో..

చాలా సంఘటనల్లో వివాహేతర సంబంధాల వల్లే హత్యలు, ఆత్మహత్యలు జరుగుతున్నాయి. అన్యోన్యంగా ఉన్న జంట మధ్య అనుమానాలు తలెత్తి అవి తీవ్ర స్థాయికి చేరుతున్నాయి. తన భర్త పరాయి స్త్రీతో తిరుగుతున్నాడని తెలిసిననుంచి ఇద్దరి మధ్య విభేదాలు మొదలై అవి చినికిచినికి గాలివానగా మారి హత్యలు, ఆత్మహత్యలకూ దారితీస్తున్నాయి. భార్య లేదా భర్త వివాహేతర సంబంధం పెట్టుకున్నపుడు ప్రియుడు/ప్రియురాలితో కలిసి కట్టుకున్న భర్త/భార్యను హతమారుస్తున్న సంఘటనలు ఇటీవలి కాలంలో పెరిగిపోతున్నాయి.

మద్యం, వ్యసనాలు కూడా కారణమే...

కుటుంబాల్లో వివాదాలు, విభేదాలకు మద్యంతో పాటు జూదం, బెట్టింగులు కూడా కారణమవుతున్నాయి. తాగుడు, ఇతర వ్యసనాలకు అలవాటు పడిన కొడుకును తల్లిదండ్రులు మందలించినా, భర్తను భార్య మందలించినా తాగిన మత్తులో కన్నవారిని, కట్టుకున్న భార్యను చంపడానికి వెనుకాడడం లేదు. కొన్ని సందర్భాల్లో తాగి ఇబ్బంది పెడుతున్న కొడుకు/భర్తను భరించలేని కుటుంబ సభ్యులు ఆవేశంలో చంపేస్తున్నారు. మద్యంతో పాటు ఇతర వ్యసనాలు కాపురాలను కకావికలం చేస్తున్నాయి. ఇలాంటి ఘటనలు గతంలో జిల్లాలో చోటు చేసుకున్నాయి. చిన్నచిన్న కారణాలకే ఆత్మహత్యలు, హత్యలు సాధారణంగా మారాయి. ఈ పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది.

అమ్మకు అక్షరాభ్యాసం



పొతంగల్‌ఖుర్దులో నిరక్షరాస్య మహిళలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తోటి సంఘం సభ్యులు

- జిల్లాలో 42,749 మందిని అక్షరాస్యులుగా మార్చే కార్యక్రమం
- రాష్ట్రంలోనే మొదటిసారిగా జిల్లాలో వినూత్న ప్రయోగం
- పొతంగల్ ఖుర్దులో ప్రారంభించిన డీఈవో

కామారెడ్డి టౌన్ : జిల్లాలో వంద శాతం మహిళలను అక్షరాస్యులుగా చేయాలన్న లక్ష్యంతో విద్యాశాఖ వినూత్న కార్యక్రమం చేపట్టింది. 'అమ్మకు అక్షరాభ్యాసం' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లాలోని స్వయం సహాయక సంఘాలలో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా చేయనున్నారు.

జిల్లాలోని 25 మండలాల్లో 17,194 స్వయం సహాయక సంఘాలున్నాయి. వాటిలో 42,749 మంది సభ్యులు నిరక్షరాస్యులని గుర్తించారు. వీరందరిని అక్షరాస్యులుగా చేసే దిశగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని శుక్రవారం గాంధారి మండలం పొతంగల్ ఖుర్దులో డీఈవో రాజు ప్రారంభించారు. గ్రామంలో వేదపండితుడితో అక్షరాభ్యాసం పూజ చేయించి పలకా బలపం పట్టించి అక్షరాలు దిద్దించారు.

తోటి సభ్యులతో చదువు చెప్పించే ప్రణాళిక..

న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్‌కు అనుసంధానంగా రాష్ట్ర ప్రభుత్వం వయోజన విద్యలో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్యులైన మహిళలకు అదే గ్రూపులోని అక్షరాస్యులైన మహిళలతో చదువు చెప్పించనున్నారు. వయోజన విద్యా విభాగం ప్రత్యేక కార్యక్రమాలతో వారు అక్షరాలు చదివేలా, చిన్నపాటి లెక్కలు చేసేలా, ఇంగ్లిష్ చదివేలా చేయాలన్నది ఈ కార్యక్రమ ఉద్దేశం. జిల్లాలోని అన్ని మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి బడిబాటలో భాగంగా నిర్వహిస్తున్న సామూహిక అక్షరాభ్యాసాలతో పాటు వయోజన విద్య విభాగానికి సంబంధించిన 'అమ్మకు అక్షరాభ్యాసం' కార్యక్రమాలను సైతం ఘనంగా నిర్వహిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో రాజు

వందశాతం అక్షరాస్యత జిల్లాగా మార్చాలన్న లక్ష్యంతో..

వంద శాతం అక్షరాస్యత కలిగిన జిల్లాగా మార్చేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు 'అమ్మకు అక్షరాభ్యాసం' కార్యక్రమం ప్రారంభించాం. జిల్లావ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలలో వయసుతో సంబంధం లేకుండా నిరక్షరాస్యులైన వారిని గుర్తించాం. వారందరికీ ఈ కార్యక్రమంలో చదువు నేర్పుతాం. తెలుగు పదాలు, ఇంగ్లిష్ అక్షరాలు చదివేలా, చిన్నపాటి లెక్కలు చేసేలా చూడాలన్నది కార్యక్రమ ఉద్దేశం. ఇలాంటి కార్యక్రమం చేపట్టడం రాష్ట్రంలోనే తొలిసారి. – రాజు, డీఈవో, కామారెడ్డి

ఫోన్ చేస్తే బస్సు వేళలు.. చార్జీల వివరాలు



ఖలీల్‌వాడి: ఆర్టీసీ బస్సు ప్రయాణికుల కోసం సంస్థ మరో సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. నిజామాబాద్ రీజియన్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, కామారెడ్డి డిపోల నుంచి ఆయా ప్రాంతాలకు బస్సులు బయలుదేరు సమయం వివరాల తెలుసుకునేందుకు బస్టాండ్‌లకు వెళ్లే అవసరం లేకుండా ప్రత్యేక ఫోన్ నంబర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆ నంబర్లకు ఫోన్ చేసి బస్సుల వేళలు, చార్జీల వివరాలు తెలుసుకోవచ్చు. సంస్థ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని సురక్షిత ప్రయాణం చేయాలని ఆర్ఎం జ్యోత్స్న శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఫోన్‌నంబర్లు..	
ఆర్మూర్	73828 43133
బోధన్	98495 00725
నిజామాబాద్	99592 26022
బాన్సువాడ	94911 05706
కామారెడ్డి	73828 43747

బాధ్యతలు స్వీకరించిన కొత్త కలెక్టర్

- స్వాగతం పలికిన అదనపు కలెక్టర్లు, అధికారులు



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్

కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి మొక్కను అందిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్ మహతో

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కలెక్టర్‌గా టి వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం 4.45 గంటల సమయంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్దకు చేరుకున్న ఆయనకు అదనపు కలెక్టర్లు స్వాగతం పలికారు. నేరుగా తన చాంబర్‌కు చేరుకున్న కృష్ణారెడ్డి అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తదితరులతో భేటీ అయ్యి జిల్లా స్థితిగతులు, స్థానిక పరిస్థితుల గురించి చర్చించారు. కొత్త కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులు కలిసి పరిచయం చేసుకున్నారు. అదనపు కలెక్టర్లతో పాటు ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టర్‌కు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.

కాలువల ఆనవాళ్లేవి?



నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలయ్యే నీటిని ఆయకట్టుకు అందించేందుకు నిర్మించిన ఉప కాలువలను పట్టించుకునేవారు లేకపోవడంతో కనుమరుగయ్యాయి. పిచ్చిమొక్కలతో నిండిపోయి, మట్టి పూడుకుపోయి ఆనవాళ్లు లేకుండా పోయాయి. నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి, రాంపూర్, బస్వాయిపల్లి గ్రామాల శివారు ప్రాంతాలకు నీటిని అందించే 20 వ డిస్ట్రిబ్యూటరీ కాలువ సైడ్‌వాల్ దెబ్బతిని కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. అధికారులు స్పందించి కాలువలను బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు. – నస్రుల్లాబాద్





నిధులున్నా.. పనుల జాడేది?



- కేజీబీవీల్లో మరమ్మతులకు నిధుల కేటాయింపు
- 19 విద్యాలయాలకు రూ. 3.41 కోట్లు
- మొదటి విడతలో రూ. 1.64 కోట్లు మంజూరు
- పాఠశాలలు పునఃప్రారంభమైనా మొదలుకాని పనులు

నాగిరెడ్డిపేట: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇందులో దాదాపు సగం నిధులను మంజూరు చేసింది. ఈ పనులను విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాల్సింది. కానీ పాఠశాలలు పునఃప్రారంభమైనా పనుల జాడ మాత్రం కనిపించడం లేదు.

జిల్లాలో 19 కేజీబీవీలు ఉన్నాయి. ఆయా విద్యాలయాల భవనాల మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 3.41 కోట్లు కేటాయించింది. మొదటి విడతగా పాఠశాలలవారీగా నిధులను కేటాయిస్తూ మొత్తం రూ. 1.64 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధులతో కేజీబీవీల్లో అదనపు వసతి గృహాలు, అదనపు టాయ్‌లెట్లు, స్నానపు గదులు, అదనపు కిచెన్ షెడ్లు, క్రీడా కోర్టులు, సెప్టిక్‌ట్యాంకులు, డ్రెయినేజీ అవుట్‌లెట్లు, డ్రెయినేజీ పైపులైన్ల నిర్మాణం, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఇదివరకు ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్ల మరమ్మతులు, సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు, విద్యుత్ వైరింగ్ మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. వీటితోపాటు గతంలో అసంపూర్తిగా ఉన్న భవనాల పనులను సైతం పూర్తి చేయాలి. ఆయా పనులకు అనుమతులు లభించకపోవడంతో పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు.

నాలుగు పాఠశాలలకు అధిక నిధులు

జిల్లాలో 19 కేజీబీవీలు ఉండగా.. నాలుగింటికి మాత్రం అధిక నిధులు కేటాయించారు. నాగిరెడ్డిపేట, రామారెడ్డి, తాడ్వాయి, మాచారెడ్డిలలోని భవనాలను చాలా ఏళ్ల క్రితం నిర్మించారు. దీంతో వాటి మరమ్మతులతోపాటు అదనపు గదుల నిర్మాణం కోసం ఎక్కువ నిధులు ఇచ్చినట్లు తెలుస్తోంది.

నిధుల కేటాయింపులో ఆలస్యంతోనే..

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో మరమ్మతులకు నిధుల కేటాయింపులో ఆలస్యం జరిగింది. ఏప్రిల్ 24న వేసవి సెలవులు ఇచ్చారు. అప్పటికే నిధులు మంజూరు చేసి, పనులు చేపట్టి ఉంటే పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పూర్తి చేయడానికి అవకాశం ఉండేది. కానీ ప్రభుత్వం గతనెల 15న నిధులు కేటాయించింది. ఇప్పటికీ పనుల అంచనాలకు అనుమతులు రాలేదు. దీంతో పనులు మొదలు కావడం లేదు. అధికారులు త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అంచనాలు రూపొందించాం

జిల్లాలోని కేజీబీవీల్లో చేపట్టాల్సిన మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆయా పనులకు సంబంధించి ఇప్పటికే అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– సుబ్బారాయుడు, ఏఈ, టీజీఈడబ్ల్యూఐడీసీ, కామారెడ్డి

జిల్లాలోని కేజీబీవీలకు మంజూరైన నిధుల వివరాలు..

పాఠశాల	కేటాయించిన నిధులు (రూ.లక్షల్లో)	మంజూరైన నిధులు (రూ.లక్షల్లో)						
			బీబీపేట	8	3.856	బీర్కూర్	16	7.712
			బిచ్కుంద	8	3.856	నిజాంసాగర్	21	10.122
			దోమకొండ	8	3.856	మాచారెడ్డి	45	21.690
గాంధారి	5	2.410	కామారెడ్డి	8	3.856	రామారెడ్డి	48	23.136
బాన్సువాడ	5	2.410	రాజంపేట	11	5.302	తాడ్వాయి	48	23.136
జుక్కల్	8	3.856	మద్నూర్	11	5.302	నాగిరెడ్డిపేట	48	23.136
ఎల్లారెడ్డి	8	3.856	భిక్కనూరు	11	5.302	మొత్తం	341	164.632
పిట్లం	8	3.856	లింగంపేట	16	7.712			

క్లుప్తంగా

వాహనాల తనిఖీ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్‌గేట్ వద్ద శుక్రవారం స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాల ధృవపత్రాలను పరిశీలించడంతో పాటు పెండింగ్ చలాన్లను కట్టించారు. నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సూచించారు.

బదిలీపై వెళ్లిన పోలీసులకు సన్మానం

నస్రుల్లాబాద్ : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన పోలీసు సిబ్బందిని శుక్రవారం ఎస్సై లావణ్య సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఏఎస్సై అబీద్ బేగ్, పోలీసులు ఖాజా పాషా, బాబులాల్, గంగారాం, నారాయణ, నాగయ్య, సుధారాణి లను శాలువా కప్పి అభినందించారు. ఆమె వెంట నాయకులు సున్నం సాయిలు, మండల ముఖ్య నాయకులు, పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కోర్టు సిబ్బంది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సుష్మ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాజీ చేసుకోదగ్గ కేసులను న్యాయమూర్తి సమక్షంలో రాజీ చేసుకోవడానికి అవకాశం ఉంటుందని వారు తెలిపారు.

17 వరకు వెబ్ ఆప్షన్‌కు అవకాశం

నిజామాబాద్ అర్బన్: డైట్ కళాశాలలో ప్రవేశాల కోసం సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్నవారు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని నిజామాబాద్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి 17వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన కళాశాలల కేటాయింపు ఉంటుందని తెలిపారు. సీటు పొందిన వారు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు అలాట్‌మెంట్ లెటర్ తీసుకొని సంబంధిత కళాశాలలో జాయిన్ కావాలని సూచించారు.

భవిత కేంద్రాల్లో సమస్యల తిష్ట

- మరమ్మతులకు నోచుకోని మూత్రశాలలు
- సమస్యలు పరిష్కరించాలంటున్న ప్రజలు



పాడైపోయిన మూత్రశాలలు



బాన్సువాడలోని భవిత కేంద్రం

బాన్సువాడ రూరల్ : విద్యాహక్కు చట్టం 2009 అమలులో భాగంగా 6నుంచి 14 ఏళ్లలోపు బాలబాలికలందరూ ఉచిత నిర్బంధ విద్య పొందాలి. ప్రత్యేక అవసరాలు కల్గిన దివ్యాంగ విద్యార్థులు కూడా ఇందుకు మినహాయింపు కాదు. అప్పటి ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థుల కోసం 2012–13లో భవిత కేంద్రాలను నెలకొల్పింది. కామారెడ్డి జిల్లాలో 22మండలాల్లో భవితకేంద్రాలు కొనసాగుతుండగా ఐదింటికి మాత్రమే శాశ్వత భవనాలు ఉన్నాయి. మిగిలిన 17 కేంద్రాలు ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్నాయి.

సుమారు 2వేల మంది దివ్యాంగులు..

కామారెడ్డి జిల్లాలోని 22 భవిత కేంద్రాల్లో సుమారు 2వేల మంది దివ్యాంగులు నమోదై ఉన్నారు. ఫిజియో థెరపీ, ప్రత్యేక విద్య కోసం వచ్చే విద్యార్థులు సుమారు 300 మంది ఉన్నారు. వీరంతా జన్యులోపాలతో పాటు పోలియో, పక్షవాతం, వినికిడిలోపం, ఎముకల బలహీనత, బుద్ధిమాంద్యం, బహుళవైకల్యం వంటి 21రకాల రుగ్మతలతో బాధపడ్తున్నారు. వీరితో ఎస్కార్టు సహాయంతో వివిధ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు 400మంది వరకు ఉన్నారు.

మౌలిక వసతులు కరువు..

భవిత కేంద్రాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. మల,మూత్ర శాలలు పాడై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ర్యాంపులు, రెయిలింగ్ చెడిపోయాయి. గోడలపై బొమ్మలు లేక, ఏళ్ల తరబడి వాల్ పెయింటింగ్ చేయించక పోవడంతో భవనాలు బోసిపోతున్నాయి. బాన్సువాడలోని భవితకేంద్రంలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కట్టిన ఏడాదికే మలమూత్ర శాలలు పాడైపోయాయి. నీటిసౌకర్యం నిలిచిపోయింది. పలుచోట్ల టైల్స్ పగిలిపోయాయి. దీంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోనే భవితకేంద్రం ఉన్నా అధికారులు పట్టింపులేదు. భవిత కేంద్రానికి ఫిజియోథెరపీ, ప్రత్యేక విద్య కోసం వచ్చే విద్యార్థులు, వారి వెంట వచ్చే ఎస్కార్ట్‌లకు మూత్రవిసర్జనకు పోవాలన్నా ఇబ్బందులు పడుతున్నారు.

నెలాఖరుకల్లా మరమ్మతులు



బాన్సువాడ భవిత కేంద్రంలో మల మూత్రశాలలు పాడైపోయిన మాట వాస్తవమే. భవిత కేంద్రానికి వచ్చే దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఇబ్బంది కలుగకుండా ఈనెలాఖరు కల్లా నిధులు సమీకరించి మరమ్మతులు చేయిస్తాం.

– నాగేశ్వరరావు, మండల విద్యాధికారి, బాన్సువాడ

బీబీపేట బాలికల పాఠశాల బాలుర పాఠశాలకు బదిలీ

- జూనియర్ కళాశాల కోసం బాలికల పాఠశాల కేటాయింపు
- వ్యతిరేకంగా కార్యాచరణకు సిద్ధమవుతున్న తల్లిదండ్రులు



బీబీపేటలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బీబీపేట: అరవై ఏళ్ల చరిత్ర కలిగిన బీబీపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను బాలుర పాఠశాలకు బదిలీ చేశారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల 1965లో ప్రారంభించబడింది. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

ఉత్తర్వులు జారీ..

బీబీపేటలో గత మూడేళ్ల క్రితం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభించడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు బాలుర ఉన్నత పాఠశాలలో కళాశాల కొనసాగింది. అయితే ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాటు పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయనే ఉద్దేశ్యంతో అందులో నుంచి కళాశాలను ప్రస్తుతం బాలికల పాఠశాలకు తాత్కాలికంగా మారుస్తూ గురువారం డీఈవో రాజు ఉత్తర్వులు జారీ చేశారు. బాలికల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులను బాలుర పాఠశాలకు వెళ్లాలని ఉత్తర్వుల్లో సూచించారు.

ఆందోళనకు సిద్ధమైన విద్యార్థుల తల్లిదండ్రులు

మండలంలో కేవలం ఒకటే బాలికల పాఠశాల ఉండడంతో దానిని బాలుర పాఠశాలకు మార్చడంపై విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసుకొని కార్యాచరణకు సిద్ధమవుతున్నారు.

పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని ధర్నా

మండల కేంద్రంలో ఉన్న పభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ విద్యార్థినుల తల్లిదండ్రులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. బాలికల పాఠశాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కేటాయించడంపై విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. ప్రధాన రోడ్డుపై బైఠాయించి రెండు గంటల పాటు నిరసన తెలిపారు. ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే ఏకైక పట్టు చేనేత సహకారం సంఘం

మీకు తెలుసా?



తెలంగాణ ఉన్న ఏకైక పట్టు చేనేత సహకార సంఘం ఆర్మూర్ పట్టణంలో కొనసాగుతోంది. గోల్‌బంగ్లా వద్ద ఉన్న పట్టు చేనేత సహకార సంఘాన్ని 1951 ఏప్రిల్ 3వ తేదీన ఆప్కో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పండిత్ శివలింగు స్థాపించారు. ఈ ప్రాంతంలో ఉన్న పట్కారి (ఖత్రి) పట్టు కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు చేనేత కార్మికులను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో సహకార సంఘాన్ని ఏర్పాటు చేశారు. పట్టుచీరలు, పట్టు ధోవతులు, కండువాలు, తలపాగాలు, షర్టింగ్ పట్టు వస్త్రాలను మగ్గాలపై నేసి విక్రయించేందుకు దీన్ని నెలకొల్పారు. ఆర్మూర్ పట్టు చేనేత సహకార సంఘం స్థాపించనప్పుడు 98 మంది చేనేత కార్మికులు ఉండేవారు. 1990లో కార్మికుల సంఖ్య 576 మందికి పెరిగింది. ప్రస్తుతం సుమారు 468 మంది సభ్యులున్నారు. పట్టును బెంగళూరు నుంచి తీసుకొస్తారు. గతంలో కోల్‌కతా, కశ్మీర్ నుంచి తీసుకొచ్చేవారు. పట్టు వస్త్రాలు నేసే ముడి సరుకు (అడ్డదారం, నిలువు దారం) ధరలు ప్రస్తుతం పెరగడంతో ఉత్పత్తి చేసిన పట్టువస్త్రాల అమ్మకాల్లో లాభాలు రాకపోవడంతో ఆర్థిక భారంతో నేత పనికి క్రమంగా స్వస్తి పలుకుతున్నారు. ఇక్కడ నేసిన పట్టు వస్త్రాలకు మన రాష్ట్రంతోపాటు జిల్లాలోనూ పెద్దగా ఆదరణ లేదు. పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలోని నాందెడ్, బస్మత్, నాయ్‌గావ్, పర్బనీలో పట్టు వస్త్రాలను విక్రయిస్తారు.

– ఆర్మూర్

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

- తహసీల్దార్ సుధాకర్
- ముగిసిన రెవెన్యూ సదస్సులు



దోమకొండలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ , ఎంపీడీవో, తదితరులు

దోమకొండ/తాడ్వాయి/నస్రుల్లాబాద్/సదాశివనగర్ : భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి కార్యక్రమం ప్రభుత్వం నిర్వహించిందని తహసీల్దార్ సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో భూభారతి సదస్సులు ముగిసినట్లు వివరించారు. తాడ్వాయి మండలం సోమారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ శ్వేత మాట్లాడారు. నస్రుల్లాబాద్ మండలం అంకోల్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సువర్ణ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామానికి చెందిన 40 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, వాటిని విచారణ జరిపి సమస్య పరిష్కరిస్తామన్నారు. సదాశివనగర్ మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్లు రేఖ, తిరుపతి, ఆర్‌ఐలు వెంకట స్వామి, సాహిత్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ



బోర్లం జెడ్పీహైస్కూల్‌లో యూనిఫాంలు పంపిణీ చేస్తున్న నాయకులు

బాన్సువాడ రూరల్/కామారెడ్డి రూరల్/నిజాంసాగర్/నస్రుల్లాబాద్ / మాచారెడ్డి : విద్యార్థులకు పలు చోట్ల ఉపాధ్యాయులు శుక్రవారం పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. బాన్సువాడ మండలం బోర్లం జెడ్పీహైస్కూల్‌లో హెచ్‌ఎం వెంకట రమణ. రెడ్‌క్రాస్ బాన్సువాడ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రావణి దేవేందర్‌రెడ్డిలతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాంలను పంపిణీ చేశారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. నిజాంసాగర్ మండలం వెల్గనూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థు లకు ఒక జత యూనిఫాం అందజేశారు. నస్రుల్లాబాద్ మండలం మైలారం గ్రామంలో ఎంపీడీవో సూర్యకాంత్ విద్యార్థులకు పుస్తకాలు,యూనిఫాంలు అందించారు. మాచారెడ్డి మండలం లచ్చాపేటలో విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 2026 సివిల్ సర్వీస్ పరీక్షకు సన్నద్ధమయ్యే వారికి ఉచితంగా లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి జూలై 8వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. ఉచిత కోచింగ్ హైదరాబాద్‌లోని లక్ష్మీనగర్‌లో ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న వారిలో వందమంది ప్రతిభావంతులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 08462 241055 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కక్షిదారు వద్దకు న్యాయమూర్తి



ఆర్మూర్‌టౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఆర్మూర్ కోర్టులో శుక్రవారం కొట్లాట కేసులో ఇరువురు రాజీ పడ్డారు. అయి తే నడవలేని స్థితిలో ఉన్న కక్షిదారు దగ్గరకే న్యాయమూర్తి సరళ రాణి వచ్చారు. ఈ కేసులో రాజీ కుదిర్చారని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

ఆస్పత్రిలో రోగి భర్త ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం మహమ్మద్ నగర్‌కు చెందిన సాయిలు (38) గురువారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయిలు భార్య సంగీతను అనారోగ్యం కారణంగా ఈ నెల 6న ఆస్పత్రిలో చేర్పించారు. సంగీత రక్త హీనతతో బాధపడుతుండగా, మరో వైపు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన సాయిలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రైం కార్నర్

గుర్తింపు లేని పాఠశాల సీజ్



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి వేంకటేశ్వర కాలనీలో ప్రభుత్వ గుర్తింపు లేకుండా కొనసాగుతున్న హ్యాపీ కిడ్స్ పాఠశాలను ఎంఈవో రాజగంగారాం శుక్రవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులు లేని పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్పించొద్దని తల్లిదండ్రులకు సూచించారు. ప్రకటనలను చేసి మోసపోవద్దని, నాణ్యమైన విద్యనందించే పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు.

రెండు గూడ్స్ వాహనాలు..



ఆర్మూర్‌టౌన్: ఫిట్‌నెస్, పర్మిట్ లేని రెండు గూడ్స్ వాహనాలను సీజ్ చేసినట్లు ఎంవీఐ వివేకానందరెడ్డి తెలిపారు. ఆర్మూర్‌తోపాటు మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్ ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలల బస్సులను, గూడ్స్ వాహనాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివేకానందరెడ్డి మాట్లాడుతూ.. వాహనదారులు సరైన సమయంలో ఫిట్‌నెస్, ఇన్సురెన్స్, టాక్స్ చెల్లించాలని, లేనిపక్షంలో సీజ్ చేయడం జరుగుతుందన్నారు. సీజ్ చేసిన రెండు గూడ్స్ వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తనిఖీలో ఆర్టీఏ సిబ్బంది మనోజ్, దశరథ్ పాల్గొన్నారు.

శ్రీ చైతన్యకు అనుమతి లేదు

నిజామాబాద్ అర్బన్: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన భవనంలో శ్రీ చైతన్య పాఠశాల అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతోందని, ఆ పాఠశాలకు ఎలాంటి అనుమతి లేదని నిజామాబాద్ రూరల్ మండల విద్యాశాఖ అధికారి సేవల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు లేని పాఠశాలలో తమ పిల్లలకు అడ్మిషన్లు తీసుకోవద్దని తల్లిదండ్రులకు ఆయన సూచించారు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలుశిక్ష

నిజామాబాద్ లీగల్: హత్యాయత్నం కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి పి సాయిసుధ తీర్పునిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ నగరంలోని గౌతంనగర్‌కు చెందిన రేణుకకు పోచమ్మగల్లీకి చెందిన మద్దికుంట వెంకటితో వివాహమైంది. గొడవ కారణంగా రేణుక తన ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిగారి ఇంటి వద్దే ఉంటోంది. అదే ఇంట్లో రేణుక అక్కయ్య అనుపమ సైతం ఉంటోంది. మరో వైపు రెండో పెళ్ళిచేసుకున్న వెంకటి తన పిల్లలను చూసేందుకు 2017 జనవరి 17న అత్తవారింటికి వచ్చాడు. వెంకటితో మాట్లాడేందుకు పిల్లలు నిరాకరించడంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన అతడు అత్త లక్ష్మి, వదిన అనుపమపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితులు మూడో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసును విచారించిన సీనియర్ సివిల్ జడ్జి ఐపీసీ 307 సెక్షన్ ప్రకారం నిందితుడికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూటర్‌గా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ పి లక్ష్మీనర్సయ్య వ్యవహరించారు.

స్వగ్రామానికి చేరిన గల్ఫ్ మృతదేహం

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టపల్లికి చెందిన సిర్నాపల్లి గంగాధర్(40) కువైట్‌లో సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహం శుక్రవారం గ్రామానికి చేరగా, తల్లిదండ్రులు లక్ష్మి, చిన్న గంగారాంతోపాటు భార్య సుజాత, కూతుళ్లు, కొడుకు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబీకులు, బంధుమిత్రులు, గ్రామస్తులు గంగాధర్ అంత్యక్రియలను పూర్తి చేశారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్




వివరాలు వెల్లడిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న

ఖలీల్‌వాడి: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని, మరొకరు పరారీలో ఉన్నారని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ నగరంలోని జకీర్‌ఫామ్ హౌజ్‌లో తనిఖీ చేయగా షేక్ షకీల్ అనే వ్యక్తి వద్ద 134 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. అతడిని విచారించగా మధుకర్ వద్ద తాను గంజాయి కొనుగోలు చేశానని చెప్పాడు. వెంటనే మధుకర్ ఇంటి వద్ద తనిఖీలు చేసి 50 గ్రాముల గంజాయి సీజ్ చేశారు. షకీల్, దాతే మధుకర్‌తోపాటు దాగే దాతూరాం ముగ్గురు గంజాయి విక్రయిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది గుర్తించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి పట్టుబడిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. గంజాయితోపాటు ఇతర మత్తుపదార్థాలు విక్రయించే వారికి సంబంధించిన సమాచారాన్ని 87126 58970 నంబర్‌కు అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ అన్నారు. ఎక్సైజ్ ఎస్సై రాము, హెడ్‌కానిస్టేబుల్ చిట్టి నారాయణరెడ్డి, హమీద్, శివ, ప్రీతమ్, అవినాష్, భోజన్న, విష్ణు, రాజన్న పాల్గొన్నారు.

దాడి కేసులో ఆరుగురు..

మోర్తాడ్(బాల్కొండ): మండల కేంద్రంలో రొయ్యల సురేశ్ అనే వ్యక్తిపై రెండు రోజుల క్రితం దాడికి పాల్పడిన ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విక్రమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రొయ్యల సురేశ్ కారులో వెళ్తుండగా రోడ్డుకు అడ్డంగా బైక్ నిలిపిన మహ్మద్ షాహబాజ్, అబ్దుల్ మజార్‌ను బైక్ తీయాలని అనడంతో వారు దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. సురేశ్‌పై బైక్‌ను పడేసి తలపై రాడ్‌తో కొట్టారని, వారికి మహ్మద్ అస్లాం, అబ్దుల్ మాలిక్, అబ్దుల్ అర్బాజ్, మహ్మద్ ఫయాజ్‌లు మద్దతు తెలుపుతూ దాడికి ఉసిగొలుపుతూ బూతులు తిట్టారని తెలిపారు. తన భర్తపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సురేశ్ భార్య సౌమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.


వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



మల్లేశ్ మృతదేహం

ఖలీల్‌వాడి: ప్రమాదవశాత్తు మురికికాలువలో పడి నగరంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన సిద్దులోల్ల మల్లేశ్(76) అనే వ్యక్తి మృతి చెందినట్లు నాల్గోటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తాలో కూరగాయల షాపు నడిపే మల్లేశ్ గురువారం రాత్రి 7.30 గంటలకు సీతారాంనగర్ కాలనీలోని ఇంటి వచ్చాడు. ఆ తరువాత వైన్స్‌షాపునకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. శుక్రవారం ఉదయం గాయత్రినగర్‌లోని పద్మశాలి సంఘం వద్ద మురికికాలువలో ప్రమాదవశాత్తు పడి చనిపోయాడు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో..



మోతీలాల్ మృతదేహం

బాన్సువాడ రూరల్: నిజాంసాగర్ మండలం కొనతండాకు చెందిన దేవసోత్ మోతీలాల్ (48) అనే వ్యక్తి గురువారం రాత్రి తిర్మలాపూర్ శివారులో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాన్సువాడ మండలంలోని బుడిమి గ్రామంలో తాను పనిచేసే రైస్‌మిల్లుకు వస్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. మోతీలాల్ ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. మృతుడి భార్య దేవసోత్ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మోహన్ తెలిపారు. మృతుడికి కూతురు, కొడుకు ఉన్నారు.

పాముకాటుతో..



కిష్టయ్య (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని వాడి గ్రామానికి చెందిన బాల్‌లింగం కిష్టయ్య(67) అనే వ్యక్తి పాముకాటుతో మృతి చెందాడు. కిష్టయ్య గురువారంరాత్రి భోజనంచేసి తన ఇంట్లో నిద్రించాడు. శుక్రవారం వేకువజామున నాలుగు గంటలప్రాంతంలో తనను పాము కరిచిందని భార్య సిద్ధవ్వకు తెలిపాడు. వెంటనే ఆమె కుమారులతో కలిసి కిష్టయ్యను మెదక్ ఆస్పత్రికి తరలించింది. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో కిష్టయ్య మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది సుశ్మన్ రెడ్డి



నిజామాబాద్ లీగల్: తెలంగాణ ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్‌గా నిజామాబాద్‌కు చెందిన న్యాయవాది సుశ్మన్ రెడ్డి నియమితులయ్యారు. సుశ్మన్ రెడ్డి నియామకం పట్ల నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల సాయిరెడ్డి, మాణిక్‌రాజ్, బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుశ్మన్ రెడ్డిని నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. సీనియర్ న్యాయవాదులు అజార్ కిషన్ రావు, నారాయణదాస్, జగన్ గౌడ్, న్యాయవాదులు శ్యామ్ బాబు, శ్రీనివాస్ గౌడ్, సురేశ్, ఇంతియాజ్, ప్రకాష్ గౌడ్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఎత్తిపోతల ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

- ఆయిల్, కాపర్ వైరు చోరీ
- రూ.10 లక్షల ఆస్తినష్టం



రెంజల్(బోధన్): మండలంలోని తాడ్‌బిలోలి ఎత్తిపోతల పథకం మొదటి స్టేజ్ గోదావరి నది ఒడ్డున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు గురువారం రాత్రి ధ్వంసం చేసి ఆయిల్, కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారు. 2016లో ఇదే తరహా చోరీ జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి చోరీ చేసినట్లు శుక్రవారం గుర్తించిన స్థానిక రైతులు ఎత్తిపోతల కమిటీ చైర్మన్ మౌలానాకు సమాచారం అందించారు. ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై చంద్రమోహన్ ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. సుమారు రూ.10 లక్షల విలువైన ఆయిల్, కాయిల్స్‌ను దుండగులు ఎత్తుకెళ్లారని గుర్తించారు. విషయం తెలిసినా విద్యుత్ అధికారులు అక్కడికి రాకపోవడంపై ఆయకట్టు రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.